# అమ్మకానికో ఇల్లు

(ఆంధ్రప్రభ వీక్లీ)

తాను ఎంతో మనసుపడి కట్టుకున్న ఇల్లు అమ్మితే, లక్షలు పోసి కొంటామని, ఒకరితో మరొకరు పోటీపడి ముందు కొస్తున్నారు !

అతనికి మతిపోయినట్లయింది ! !

ఊహించనంత రేటు పలికినా అతని మతిపోడానికి కారణమేమిటి ?

# అమ్మకానికో ఇల్లు

ఉదయం భోజనం ముగించి ఆఫీసుకు బయలుదేరటానికి సిద్ధమవుతున్నాను.

బూటు లేసులు ముడి వేసుకుంటూ వుంటే కాలింగ్ బెల్ మోగింది.

లేచి వెళ్ళి తలుపు తీశాను.

బయట వరండాలో ఒకామె నిలబడి వుంది.

నన్ను చూడగానే "నమస్కారమండీ, నా పేరు కస్తూరి" అంది వినమ్రంగా చేతులు జోడించి.

"నమస్కారం" అన్నాను ఆ అపరిచితురాలి వంక సంభ్రమంగా చూస్తూ.

"రమణరావుగారు....అంటే....మీరేనా ?"

"అవునండీ! నేనే! రండి లోపలకు!" అంటూ లోనికి నడిచేను.

సోఫా చూపిస్తూ "అలా కూర్చోండి" అన్నాను.

ఆమె పొందికగా సోఫాలో కూర్చుంది.

తర్వాత డ్రాయింగు హాలు వంకా, అవతలి పడక గదుల వంకా చూపులు మార్చి మార్చి చూసింది.

కొన్ని క్షణాల తర్వాత, "మేము అవతలి వీధిలో వుంటున్నాం. మేము అంటే నేను, మా అమ్మగారు....అంతే....ఇల్లు చూసి వెళ్దామని-" అంటూ పొడిగా మాట్లాడింది గోడల వంక చూస్తూ.

ఆమె అంత అవసరంగా ఇల్లు చూసి వెళ్దామని ఎందుకు వచ్చిందో నాకు అర్థంకాలేదు.

"మీకు....సుజాత....అదే....మా ఆవిడ—తెలుసా?"

"అబ్బే! తెలీదండీ!"

"మరి ?-"

"మేము ఈ వూరికి కొత్త! వచ్చి నాలుగు నెలలయింది. అంతే! నెల్లూరులో వుండేవాళ్ళం! నాన్నగారు క్రితం ఏడాది చనిపోయారు. మొత్తం మా భూములన్నీ అమ్మేసి ఇక్కడకు వచ్చేశాం. నేను ఇక్కడే ఎమ్.ఫిల్.లో చేరాను—" అంటూ కొంచెంసేపు ఆగి తర్వాత అంది "మంచి ఇల్లుకొని ఇక్కడే స్థిరపడిపోవాలని మా ఆలోచన!"

ఆమె మాటలు ఆపి మరొకసారి హాలు అంతా కలయజూసింది.

ఈ కస్తూరి ఎవరో నాకు తెలీదు.

మా ఆవిడకు కూడా తెలియదని కస్తూరి మాటలే చెప్తున్నాయి. మరి ఎందుకు వచ్చినట్లు ?

మా ఇంట్లో అద్దెకు ఇవ్వటానికి పోర్షను అంటూ ఏమీలేదు. నాకు పరిస్థితి ఏమీ అర్థంకాలేదు.

కొంచెంసేపు ఆమె వంక చూస్తూ వుండిపోయాను. సుమారు ఇరవై రెండేళ్ళు వుంటాయి ఆమెకు. మనిషి అందంగా, పొందికగా వుంది.

కట్టుకున్న కంచి పట్టుచీర ఆమె ఐశ్వర్యాన్నీ, మాట తీరు ఆమె చదువునూ, కూర్చున్న పద్ధతి ఆమె సంస్కారాన్నీ సూచిస్తున్నాయి.

రెండు నిమిషాలు మా మధ్య నిశ్శబ్దంగా గడిచేయి.

వాచీ చూసుకున్నాను.

పావు తక్కువ పది అయింది.

ఆఫీసుకు వేళవుతోంది.

సోఫాలో ఇబ్బందిగా కదిలేను!

నా పరిస్థితి గమనించినట్లుంది. "ఒక్కసారి మీ ఇల్లు చూద్దామని వచ్చేనుటూ...." అంలర్థోక్తిగా ఆగింది.

లాభం లేదు!

ఇల్లు చూస్తేకానీ ఈ అమ్మాయి కదిలేలా లేదు ! !

"సుజా" అంటూ పిలిచేను.

మా ఆవిడ వంటింట్లోంచి బయటకు వచ్చింది.

"మా శ్రీమతి....సుజాత....ఈ అమ్మాయి పేరు కస్తూరి" అంటూ పరిచయాలు చేశాను. "మన ఇల్లు చూస్తారుట! చూపించు!"

సుజాత యింకేమీ బదులు చెప్పకుండా "రండి" అంటూ యింటి లోకి దారితీసింది.

"ఇది డ్రాయింగ్ కమ్ డైనింగ్ హాలు" అంటూ సుజాత తన డ్యూటీ ఆరంభించింది ఇల్లు చూపిస్తూ.

"సైజు ఎంత వుంటుంది?"

"అవన్నీ నాకు తెలీదు. మా ఆయనే చెప్పాలి. ఏమండీ? ఈ హాలు సైజు ఎంత?" అంటూ నా వంక తిరిగి అడిగింది.

సోఫాలోంచి లేచి వాళ్ళ వెనుకే వెళ్ళక తప్పలేదు నాకు.

"ఫోర్టీన్ బై థర్టీ" అన్నాను.

"బాగుందండీ! చాలా స్పేషస్‌గా వుంది" అంటూ కళ్ళు చక్రాల్లా తిప్పుతూ నాలుగు మూలలూ కలయజూస్తూ, బెడ్‌రూములు, వంట గది, వెనుక ఖాళీ జాగా, పక్కనున్న పెద్ద స్థలం అన్నీ చకచకా తిరిగింది.

"శ్లాబ్ దళసరి ఎంత?" అంది లోనికి వస్తూ.

"అయిదంగుళాలు" అన్నాను.

"ఫినిషింగ్ అంతా చాలా బాగుందండీ! కానీ గోడల్లో అక్కడక్కడ కొంచెం బీటలు వచ్చేయి. ఇల్లు కట్టించి ఎన్నాళ్ళయింది ?"

"పూర్తి అయి సంవత్సరమయింది. అవి గోడల్లో బీటలు కావు! ప్లాస్టరింగ్‌లో గాలిపగుళ్ళు! అంతే!" అన్నాను.

"అలా అయితే ఫరవాలేదు, ఇల్లంతా చక్కగా వుంది. నేలంతా కడప స్లాబ్స్ ఫినిషింగ్ చాలా బాగా వచ్చింది. బాత్‌రూంలో గ్లేజ్‌డ్ టైల్సు పరిపించి వుంటే యింకా అద్భుతంగా వుండేది" అంది చిరునవ్వుతో.

ఈ సలహాతో నాకు అరికాలిమంట నెత్తికెక్కింది.

ఈవిడ బోడిసలహా ఎవడిక్కావాలి?

మూడు నెలలనుండీ ఈ గ్లేజ్‌డ్ టైల్సు విషయమై నాకూ, మా ఆవిడకీ వాదోపవాదాలు జరుగుతున్నాయి !

గ్లేజ్ టైల్సువర్కు అంటే మాటలా ?

కనీసం అయిదువేల రూపాయలు పట్టుకోవాలి !

ఇంటిమీద అప్పులు ఇంకా బోలెడు వుండిపోయాయి.

రెండు లక్షలతో ఇల్లు కట్టటం నాకు తలకుమించి పని అయింది.

ఇంక యిలాటిపన్నీ చేయించటం నావల్లకాదు.

మా ఆవిడ విజయగర్వంతో నా వంక చూస్తూ "ఇంత చక్కగా ఇల్లు తయారయిందా ? ఆ అయిదువేల రూపాయల దగ్గరా కక్కుర్తి ఎందుకు చెప్పండి? ఈ మొగాళ్ళకి తోచాలి కానీ, మనంచెప్తే వింటారా?" అంది.

'ముక్కు మొహమూ తెలియని ఆ అమ్మాయి దగ్గర అలా మాట్లాటతావేమిటి?" అన్నట్లు మా ఆవిడ వంక చిరాగ్గా చూశాను.

నా చిరాకు గ్రహించి "కాఫీ తెస్తాను" అంటూ వంటింట్లోకి వెళ్ళిపోయింది సుజాత.

"ఈ ఇంటిమీద తాకట్టు ఏమయినా వుందా ?" అడిగింది కస్తూరి.

బొత్తిగా పరిచయంలేని ఆ అమ్మాయి నుండి నేను ఊహించని ప్రశ్న ఇది !

"ఈ ప్రశ్నలన్నీ ఎందుకు?"

ఈసారి ముఖంలో చికాకు కనబరిచేను.

"ఇల్లు కొనుక్కునేటప్పుడు కనీసం ఈ మాత్రం వివరాలు తెలుసుకోవటంలో తప్పులేదు కదా!" అంది బింకంగా.

"ఎవరు కొనుక్కుంటున్నారు ?"

"మేము....మా కోసమే!"

"ఇంతకీ ఈ ఇల్లు అమ్ముతున్నట్లు ఎవరు చెప్పేరు ?"

గొంతుమార్చి కఠినంగా అడిగేను.

నాకీ వ్యవహారానికి తలాతోకా కన్పించటంలేదు.

ఈసారి ఆమె నా వంక వింతగా చూసింది.

"ఈ ఇంటి నెంబరు 432/8 అవునా ?"

"కరెక్టే"

"మీ పేరు కె. రమణారావుగారు అవునా ?"

"అదీ కరక్టే!"

"ఈ ఏరియా పేరు ఇంద్రప్రస్థం, అవునా?"

"అవును, అవును....అవును!" చిరాగ్గా అన్నాను.

"ఇల్లు అమ్మటం ఇష్టంలేకపోతే మరి పేపరులో ప్రకటన ఎందుకిచ్చేరు?"

"నాకు మీరు చెప్పేది అర్థంకావటంలేదు. నేను ఏ పేపరులోనూ ప్రకటన ఇవ్వలేదు. ఈ ఇల్లు అమ్ముతానని నేను ఎవ్వరితోనూ అనలేదు" అయోమయంగా ఆమె వంక చూస్తూ అన్నాను.

కస్తూరి దీర్ఘంగా నిట్టూర్చి "ఈవేళ సంధ్యారాగం పేపరులో 'అమ్మకానికో ఇల్లు' అంటూ ఓ ప్రకటన వచ్చింది. అదిగో....దానిలో.."

అంటూ టీపాయ్‌మీది పేపరు అందుకుని చకచకా పేజీలు తిరగేసి అయిదో పేజీలో వున్న ప్రకటన చూపించింది.

చక్కగా డబుల్‌లైన్‌తో బాక్సుకట్టి మరీ ప్రచురింపబడి వుంది ఆ ప్రకటన!

"విశాఖపట్నం, ఇంద్రప్రస్థ కాలనీలో అయిదు వందల గజాల స్థలంలో కట్టిన అధునాతనమయిన ఇల్లు అమ్మకానికి వుంది. ఇల్లు ప్లింత్ ఏరియా వెయ్యి అడుగులు. ఇంటినెంబరు 432/8. నేషనల్ హైవేను ఆను కొని వుంది. కావలసినవారు వెంటనే పై నంబరు ఇంట్లోనే సంప్రదిం చండి. "కె. రమణారావు అని వుంది ఆ ప్రకటనలో."

నాకు మతిపోయినట్లయింది.

అది మా ఇల్లే!

నాపేరు మీదగానే ప్రకటన పడింది!

ఎలా జరిగింది ఇది?

నా ముఖంలో రంగులు మారటం గమనించింది కాబోలు-నా వంక విజయగర్వంతో చూస్తోంది ఆ అమ్మాయి.

"క్షమించండి! ఈ ప్రకటనలో ఏదో పొరపాటు వుంది. ఈ ప్రక టన నేను ఇవ్వలేదు. అసలు నాకీ ఇల్లు అమ్మే ఉద్దేశంలేదు" అన్నాను.

ఆ మాటలు నమ్మలేనట్లు కొంతసేపు నా వంక చూసింది కస్తూరి.

తరువాత మరి ఏమనుకుందో ఏమో —

"అమ్మే ఆలోచన వుంటే నాకు చెప్పకుండా ఎవరికీ మాట ఇవ్వ కండి. యింతకీ ధర ఏమాత్రం పలుకుతుందను కుంటున్నారు?" అంటూ అడిగింది.

"అమ్మే యోచన వుంటే కదా, ధర గురించి ఆలోచించటం!"

"సర్లెండి! మూడు లక్షల రూపాయల వరకూ మేం సిద్ధంగా

వున్నాం. రిజిస్ట్రేషనుకు నాలుగు రోజులు గడువు చాలు! బేంకు లోంచి కేష్ డ్రాచేసి మీకివ్వటమే...." అంటూ సోఫాలోంచి లేచింది.

"సారీ! ఆ ఆలోచనేలేదు నాకు!" అంటూ నేను కూడా లేచి నిలబడ్డాను.

ఆమె అసంతృప్తిగా కదలి వెళ్ళిపోయింది.

నాకీ వ్యవహారమంతా పెద్ద మిస్టరీలా అనిపించింది.

సుజాత కాఫీ తీసుకు వచ్చింది.

"ఆ అమ్మాయి వెళ్ళిపోయింది. ఈ పేపరులో ప్రకటన ఎలా వచ్చిందో నాకు అర్థంకావటంలేదు. సరేగానీ వాళ్ళు మూడు లక్షలకు మన ఇల్లు కొనటానికి సిద్ధంగా వున్నారుట! అమ్మేద్దామా?" అంటూ సుజాత వంక పరిహాసంగా చూశాను.

ఆమె ఏమీ అనలేదు.

"నేను ఆఫీసుకు వెళ్తున్నా!" అంటూ బయటకు వచ్చి స్కూటరు రోడ్డుమీదకు తీశాను.

"గురువుగారూ! ఒకటే వీధిలో వుంటున్నాం కదా....నాతో ఒక్క ముక్క చెబితే పాపమా?" అంటూ ఎదురొచ్చేడు రాఘవరావు.

"దేని గురించి?"

"అదే....ఇల్లు అమ్మేస్తున్నారట కదా!"

"అబ్బే—అది కాదు...."

"ఏమీ ఫరవాలేదు....మూడు లక్షల యాభయివేలు సులువుగా వస్తుంది. అంతకి తక్కువయితే ఎవ్వరికీ మాట యివ్వకండి .... నేను మంచి పార్టీని తీసుకువస్తాను. నాకో పదివేలు కమీషను పారెయ్యండి .... చాలు" అన్నాడు పళ్ళు అన్నీ బయటకు కన్పించేలా అసహ్యంగా నవ్వుతూ.

"ఆ ప్రకటన నేను ఇవ్వలేదు"

"ఏమిటీ?—"

"అవును మహాశయా, నేను ఇవ్వలేదు. ఏదో పొరపాటు జరిగింది" అంటూ స్టార్టు చేశాను స్కూటరు.

"అయితే ఇల్లు అమ్మటం లేదా ?"

"లేదు!"

"మరయితే ప్రకటన ఎందుకు వేయించేరు?"

"అదే చెప్తున్నాను కదా....పొరపాటు ఏదో జరిగి వుంటుందని - అంటూ ఇంజను రైజ్ చేశాను."

"పొరపాటు ఏమిటి? మీనింగ్ లెస్! నా పని పాడుచేసుకుని అనవసరంగా వచ్చేను" అంటూ చిరచిర లాడుతూ వెళ్లిపోయాడు ఆయన.

తన బ్రోకర్ గుణం బయటపడి పోయిందని బాధకాబోలు!

'ఈ రకం చికాకులు ఇంకా ఎన్ని ఎదుర్కోవాలో ?' అనుకుంటూ ఆఫీసు చేరుకున్నాను.

ఆఫీసు వరండా మెట్లు ఎక్కానో, లేదో—అంతే....మా 'కొలీగ్స్' అందరూ నన్ను చుట్టుముట్టేరు!

"ఇంతమంది స్నేహితులం వున్నాం కదా, మాతో ఒక్కమాట అంటే ఏం పోయిందీ ?"

"అంత కష్టం ఏమొచ్చిందిరా? ఇప్పుడు అమ్మితే మళ్ళీ కొనగలవా? కట్టగలవా ?"

"ఈ పాడుబుద్ధి నీకు పుట్టిందా? లేక ఎవరయినా చెప్పేరా?"

"ఒరేయ్....విశాఖపట్నంలో ఇల్లు అమ్మేసుకుంటే మళ్ళీ కట్టటం నీతరం కాదురా...."

"వాడికేమిట్రా బంగారు పిచుక...."

"ఇక్కడ నాలుగు లక్షలకు అమ్మేస్తాడు. లాసన్స్‌బే కాలనీలో ఖాళీ సైటు వుంది కదా....అందులో మరో ఇల్లు లేపుతాడు...."

కథా నిలయం
3517



"మీరందరూ ఊరుకోండిరా....వాడికేం అవసరం వచ్చిందో — ఒరేయ్ రమణా....నాకు చెప్పకుండా ఎవ్వరికీ మాట యివ్వకురా— నీకు మొత్తం ఆ ఇంటికి రెండు లక్షలయింది— నాకు తెలుసు — ఈవేళ నాలుగు లక్షలకు తక్కువ కాకుండా ఇప్పించే పూచీనాది. ఆ ఏరియాకి మంచి డిమేండు వుంది. హైవే దగ్గర కదా, మా మామగారిచేత కొనిపిస్తాను. ఎవరికీమాట ఇవ్వకు"

"ఒరేయ్ నీకు పిచ్చెత్తలేదు కద....కొంప ఎందుకురా అమ్ముకోవటం?"

నాకు నిజంగానే పిచ్చెత్తిపోయేలా అన్పించింది—

మా సహోద్యోగుల మాటలతో !

రెండు నిమిషాలు మౌనంగా వుండిపోయాను.

"ఒరేయ్ ! నీకు చెముడా ? మాట్లాడవేం ?—" మెల్లగా అన్నాను.

"మీరందరూ అడగటం అయిపోయినట్టేనా ?"

"ఒరేయ్ ! వెధవపోజు కొట్టకు ! సమాధానం సరిగ్గా చెప్పి తగులడు."

"నేను ఇల్లు అమ్మటం లేదు ! పేపరులో ప్రకటన నేను యివ్వలేదు?"

ఈసారి మా మిత్ర బృందమంతా కళ్ళు తేలేశారు.

"సార్! మిమ్మల్ని అయ్యగారు రమ్మంటున్నారు సార్!" అంటూ అటెండరు వచ్చి నన్ను పిలిచేడు.

బాస్ రూంలోకి వెళ్ళేను.

"గుడ్ మార్నింగ్ సర్ !"

"గుడ్ మార్నింగ్ ! రండి, టేకొయువర్ సీట్"

కుర్చీలో కూర్చున్నాను.

"ఇల్లు అమ్మేస్తారుట కదా-ఎంతలో వుంటుంది ?"

జరిగినదంతా వివరించి చెప్పేను!

సంధ్యారాగం పేపరు ఆఫీసుకు వెళ్లి జరిగిన సంగతి కనుక్కునేందుకు గంట పర్మిషన్ కావాలన్నాను.

"తప్పకుండా....గంట కాకపోతే రెండు గంటలు తీసుకోండి .... వెళ్లిరండి...."

"థేంక్యూసార్" అని కుర్చీలోనుండి లేస్తూ వుంటే రహస్యం చెబుతున్నట్లు అన్నాడాయన.

"కంగారుపడి ఎవ్వరికీ మాట ఇవ్వకండి. అమ్మే ఉద్దేశం వుంటే నేను రెడీ! అయిదు లక్షల వరకూ ఇస్తాను. మీరెంతకు చేయిస్తానంటే అంతకే రిజిస్ట్రేషను చేయిస్తాను .... మిగిలింది బ్లాకులో ఇస్తాను .... సరేనా?"

ఏం మాట్లాడాలో తోచలేదు నాకు.

"సరేసార్!" అంటూ బయటపడ్డాను.

"నాయనా చిదంబరం.... ఒక్కసారి నా సీటువంక చూస్తూవుండు, సంధ్యారాగం పత్రికాఫీసుకుపోయి వస్తాను" అంటూ నా బీరువా తాళాలు ప్రక్కసీటులోని ఎ.టూ.కి అందించేను.

"ఉదయమే కదా ప్రకటన పడింది! అప్పుడే ఉత్తరాలు వస్తాయా? రెండు రోజులు ఆగివెళ్ళు....అయినా పోస్టుబాక్సు నెంబరు ఇవ్వలేదుగా, ఉత్తరాలు ఎలా వస్తాయి?" అంటూ పొంతన లేకుండా ప్రశ్నలు వేస్తున్నాడు చిదంబరం.

"పోస్టుబాక్సూ కాదు....వల్లకాడూ కాదు-వచ్చిన తర్వాత నీకంతా వివరంగా చెప్తాను. తాళాలు జాగ్రత్త!" అంటూ వాడి దగ్గరనుండి బయట పడ్డాను.

సంధ్యారాగం పత్రిక ఆఫీసుకు బయలుదేరాను.

ఆ దారిలోనే ప్రకాశ్‌మల్ దగాలాల్ మార్వాడీ షాపు వుంది. షాపు దాటి వెళ్ళిపోతూ వుంటే చప్పట్లుకొట్టి పిలిచేడు దగాలాల్!

"ఏం సేఠ్‌జీ?" అంటూ స్కూటరు ఆపి లోనికెళ్ళాను.

"సార్! మీకీ మాకీ బోలెడు దోస్త్....ఏంసార్? ఇలా చేశార్? ఇల్లు అమ్మితే మూడో కంటికి తెలియకూడదు సార్! పేపర్లో వేస్తార్? హావ్వ! ఇన్‌కమ్‌టాక్సు వాళ్ళు వస్తారు సార్ .... నా చెవిని ఒక్కమాట వేస్తే మంచి ధరకు కొనకపోదునా? ఎంత కావాలి? ఎంత మీ రేటు?"

మాట్లాడుకు పోతున్నాడు దగాలాల్.

వ్యవహారం అర్థమయింది.

అతడికి అంతా వివరించి చెప్పేసరికి మరో పావు గంట పట్టింది.

అంతా విని సేఠ్ నిరుత్సాహపడ్డాడు.

"మీరు అమ్మేస్తారని—శానా ఉత్సాహం పడ్డాం సార్!"

"ఓరి నీ ఇల్లుకూలా! నేను కొంప అమ్మేస్తే నీకు ఉత్సాహమా?" అనుకున్నాను మనసులో.

"మీకు అయిదు లక్షలు ఇస్తాన్ .... మీ బాకీ ఇరవై వేలు మాఫీ చేస్తాన్....చూసోకండి. నాకు మరిచిపోకండి. హైవే ప్రక్క మనకో ఇల్లు కావాల్‌స్తార్...." అంటూ నన్ను సాగనంపేడు.

'బతుకు జీవుడా' అనుకుంటూ బయటపడ్డాను. పేపరు ఆఫీసు ఎదుట స్కూటరు ఆపేను.

గేటు దగ్గర సెక్యూరిటీగార్డు వున్నాడు.

"లోపలకు వెళ్ళాలి" అన్నాను.

"ఎవరి కోసం?"

అవును! ఎవరికోసమని చెప్పను?

నాకెవరూ తెలియదు ఈ ఆఫీసులో!

"ప్రకటన ఇస్తారా?" మళ్ళీ అతడే అడిగేడు.

"అవును" అన్నాను ఏమనాలో తోచక.

"అలా తిన్నగా వెళ్తే హాలులో ఎడం ప్రక్క నాలుగో టేబిలు" తిన్నగా లోనికి నడిచి హాలులో నాలుగో టేబిలు దగ్గర ఆగేను.

టేబిలు ముందు కుర్చీలో వున్నాయన తనకీ ప్రపంచం సంబంధం లేనట్లు తలదించుకుని రిజిష్టరులో ఏవో అంకెలు కూడుతున్నాడు.

నా ఉనికిని సూచిస్తూ గట్టిగా దగ్గేను.

అదేం పట్టినట్లు లేదు ఆయనకి ! !

"అడ్వర్ టైజుమెంటు సెక్షను ఇదేనా ?"

"ఇదే....కూర్చోండి.... తొంభయి మూడూ పదీ నూటమూడు—"

"నా పేరు రమణారావు"

"ఆహా! అలాగా....నూటమూడూ ఆరూ నూట తొమ్మిది....నూట తొమ్మిది...."

"ఫుడ్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్నాను !"

"ఆహా! అలాగా....నూట తొమ్మిదీ పద్దెనిమిదీ .... నూట ఇరవై ఏడు....ఇరవై యేడు...."

"ఈవేళ పేపర్లో నాపేరుమీద 'అమ్మకానికో ఇల్లు' అంటూ ప్రకటన వచ్చింది."

"ఆహా! అలాగా ! నూట ఇరవై ఏడూనూ....మూడూను....నూట ముప్ఫయి"

"ఈ ప్రకటన ఎలా వచ్చిందో నాకు అర్థం కావటంలేదు"

"ఆహా....అలాగా....నూటముప్ఫయీ-పదిహేనూ....నూటనలభై అయిదు...."

"అసలు నేనా ప్రకటన ఇవ్వలేదు."

"ఆహా ! అలాగా — ఇంకెవరో మీ పేరుమీద ఇచ్చి వుంటారు. చూద్దాం! నూటనలభై అయిదూ....ఆరూ....నూటయాభయి ఒకటి."

"అదికాదండీ, నాకు అసలు ఇల్లు అమ్మే ఉద్దేశం లేదు. ఆ ప్రకటన ఎవరిచ్చారో నాకు తెలీదు. కొంచెం దయచేసి చూడండి."

అప్పుడాయన కాగితాల్లోంచి తలయెత్తి నా వంక చూసేడు.

"ఏమిటీ? మీకు తెలీదా? ఎవరో ఇచ్చేరా? సరే ! నూట యాభయి ఒకటి గుర్తుంచుకోండి. పోనీ, ఇల్లు అమ్మటం లేదని మరొక ప్రకటన ఇవ్వండి. ఈసారి ఫ్రంట్ పేజీలో వేద్దాం! మరో రెండు వందలు ఎక్కువవుతుంది. అంతే, ఆ! మీకు ఎంత గుర్తుంచుకొమ్మని చెప్పేనూ ?"

ఆ అంకె చెప్తే మళ్ళీ ఆయన నాతో మాట్లాడేలా కన్పించలేదు.

"ఆ ప్రకటన ఎవరిచ్చారో నాకు కావాలి! రిజిష్టరు చూసి చెప్తారా" ప్రాధేయ పూర్వకంగా అడిగేను.

"ఆహా! అలాగా! అలా చెప్పండి, మరి—" అంటూ సొరుగులో నుండి పెద్ద బిల్లుబుక్కు బయటకు తీసి, పేజీలు త్వరగా తిప్పి, ఓ పేజీ దగ్గర ఆగి, అక్కడ మడిచిపెట్టి, ఆ పుస్తకాన్ని నా ఎదరకు తోశాడు.

ఆ పేజీలో ప్రకటన వివరాలన్నీ పొందికగా రాయబడి వున్నాయి.

క్రిందుగా 'వి. రేణుక' అని ముత్యాల్లాటి అక్షరాలతో సంతకం వుంది.

ఎనభై రూపాయలు ఆ ప్రకటన నిమిత్తం చెల్లించినట్లు కూడా రాసి వుంది.

ఎవరీ రేణుక?

ఎనభై రూపాయలు ఖర్చుపెట్టి ఈ ప్రకటన ఎందుకు వేయించింది? అనుకుంటూ ఆలోచనలో పడ్డాను.

"అదీ సంగతి! ఆ! మీకెంత నెంబరు చెప్పేనూ—?" అన్నా డాయన.

"ఈ రేణుక ఎవరో నాకు తెలీదు! నా పేరుతో, మా ఇంటి వివ రాలతో అమ్మకానికో ఇల్లు వుందంటూ ప్రకటన ఎలా యిచ్చిందో కూడా తెలీదు. నాకు తెలియకుండా నా గురించిన ప్రకటనలు ఎలా వేశారు?" అంటూ ఆయన మాటలకు అడ్డుపడ్డాను.

"ఆహా! అదా? అలాగా మీరు ఆలోచిస్తున్నారు? ఇలాటి చిన్న చిన్న విషయాలు ఎవరిచ్చినా ప్రకటిస్తాం."

"ఇది నన్ను అల్లరి చెయ్యటం కాదా?"

"ఆహా! అలాగా! మిమ్మల్ని అల్లరిచేస్తే మాకేం కలిసి వస్తుంది?"

"ఎవరో ముక్కు మొహం తెలియని వాళ్ళు ఇస్తే ప్రకటన వేసె య్యటమేనా?" చిరాకుగా అడిగేను.

"ఆహా! అలాగా! అలా అంటున్నారా మీరు? మీరే రమణారావు గారని చెప్పేరు. నమ్మేనా లేదా? రసీదు బుక్కు చూపించేనా లేదా? మీరే రమణారావుగారని మాకు నమ్మకం ఏమిటి? కనీసం సమాధానం కూడా చెప్పకుండా పంపేస్తే మీరు ఏం చేయగలిగేవారు? మీకు నెంబరు ఎంత చెప్పేనూ?"

"ఇది చాలా అన్యాయం?"

"ఆహా! అలాగంటారా? మీరే ఆ రేణుకను పంపించి, ప్రకటన వేయించి, తర్వాత ఇలా ఆఫీసుకు వచ్చి, నావని పాడుచేసి, అల్లరి పెడు తున్నారని నేను పోలీసు రిపోర్టు ఇవ్వొచ్చు కదా....ఏమంటారు? నెంబరు మీకెంత చెప్పేనూ?"

ఒక్కసారి నిస్సత్తువ ముంచుకొచ్చింది.

చేసేదేం కనబడలేదు!

కుర్చీలోంచి లేచాను.

"మీకు నెంబరు ఎంత చెప్పేనూ ?"

"నూటయాభయి ఒకటి" విసుగ్గా అన్నాను.

"....ఆ! నూటయాభయి ఒకటీని పద్నాలుగూ నూట అరవై ఐదు. ఆ రేణుక ఎవరో మళ్ళీవస్తే వివరాలు కనుక్కొని మీకు రాస్తాను లెండి. ప్రకటనలో చిరునామా వుంది కదా ! నూట అరవై ఆయిదూనూ ఎనిమిదీ...."

కాళ్ళీడ్చుకుంటూ బయటకు వచ్చేశాను.

ఆఫీసుకు ఐదు నిమిషాలలో చేరుకున్నాను.

జరిగినదంతా విన్నారు మిత్రులు.

"పోలీసుస్టేషనులో రిపోర్టు ఇద్దాం!" అన్నారందరూ.

తుళ్ళిపడ్డాను.

"వద్దు....వద్దు" అన్నాను గాభరాగా.

"మలేరియా జ్వరం వచ్చిన వాడిలా అలా తుళ్ళిపడతావెందుకురా? ఎందుకా గాభరా?" అంటూ మావాళ్ళు నా వంక వింతగా చూసేరు.

నాలుగు సంవత్సరాల క్రితం పోలీసులతో ఎదురయిన చేదు అనుభవం నాకింకా గుర్తుంది.

ఏదో స్కూటరు ఏక్సిడెంటులో, ఎవరో గాయపడితే, పోనీ గదా అని పోలీసుస్టేషనుకు వెళ్ళి ఆ సంగతి రిపోర్ట్ ఇచ్చేను. అంతే!

"నువ్వే గుద్దించి వుంటావ్!" అంటూ పోలీసులు నామీద కేసు బనాయించే యత్నం చేశారు.

ఆ రొంపిలోంచి బయటపడటానికి అయిదు లీవులు, ఐదు వందల రూపాయలు ఖర్చు అయిపోయాయి.

"ఇంకో రెండురోజులు చూద్దాం. అప్పుడే పోలీసు రిపోర్టు ఎందుకు? పోలీసులతో బాధలు పడటం కష్టం!" అన్నాను నా కంగారు కప్పిపుచ్చు కుంటూ-

ఆ సాయంకాలంలోగా —

కనీసం పదిహేనుమంది ఆఫీసుకు వచ్చేరు.

'ఇల్లు కొంటామని !'

రేటు అయిదు లక్షల యాభయివేల వరకూ పెరిగిపోయింది.

ఆ రేటు వినేసరికి నాకు మతిపోయినట్లయింది.

ఏడాదిక్రితం రెండు లక్షలు పెట్టి కట్టించిన ఇంటికి ఈవేళ అయిదు న్నర లక్షలా ?

ఈ ప్రజలు మూర్ఖులా?

లేక సొంత ఇళ్ళ అవసరం ఈ పట్నంలో అంత పెరిగి పోయిందా ?

కాకపోతే, జనం దగ్గర బ్లాక్‌మనీ అంతలా చేరిపోయిందా?

లక్షలు వేలులా మాట్లాడుతున్నారు !

ఏవేవో ఆలోచనలు మనసులో కదులుతున్నాయి.

ఆఫీసయ్యాక ఇల్లు చేరుకున్నాను.

డ్రాయింగు హాలులో నలుగురు మనుషులు ఆసీనులయి వున్నారు.

వాళ్ళ పరిచయాలు అయ్యేక, వాళ్ళొచ్చిన పని అర్థమయ్యేక, సంగతి వివరించి, వీళ్ళకు క్షమాపణ చెప్పి పంపించేశాను.

సుజాత మంచినీళ్ళు తెచ్చింది.

"మీరు ఆఫీసుకు వెళ్ళేక పదముగ్గురు వచ్చేరు. ఎవరో బిల్డింగు కంట్రాక్టరుట! అర్జెంటుగా ఇల్లు కావాలిట ఆయనకి. రెడీకేష్ ఆరు లక్షలు ఇస్తానన్నారు...." అంటూ విషయాలు ఏకరువు పెట్టింది.

"అయితే, రేటు ఆరులక్షలకు పెరిగిపోయిందన్నమాట!"

మంచినీళ్ళు తాగి గ్లాసు అందిస్తూ అన్నాను.

సుజాత నా వంక ఆరాధనాపూర్వకంగా చూస్తూ — "అప్పట్లో అప్పులుచేసి, బంగారం అమ్మి మీరు ఇల్లు కడతానంటే మిమ్మల్ని నిరుత్సాహపరచేదాన్ని. ఇంతలా రేట్లు పెరిగిపోతాయని అనుకోలేదు" అంది.

రాత్రి మంచంమీద పడుకొని ఇటూ ఆటూ దొర్లుతున్నాను.

'ఈ రేణుక ఎవరు?' అనే ఆలోచనతో నిద్రపట్టటంలేదు.

సుజాత నాకు దగ్గరగా జరిగింది.

"మీరు కోపం తెచ్చుకోనంటే ఒక విషయం చెప్తాను !"

"ఏమిటది?" అడిగేను.

"పేపర్లో ప్రకటన నేనే ఇప్పించేను."

ఉలిక్కిపడ్డాను !

ప్రక్కలో బాంబు పేలినట్లయింది.

సుజాత పీక నొక్కెయ్యాలన్నంత కోపం కూడా వచ్చింది. కానీ అణచుకున్నాను.

"నువ్వా?" ఆశ్చర్యం, కోపం అన్నీ అణచుకున్న స్వరంతో అడిగేను.

"అవునండీ! నేనే!"

"నీకేం మతిపోలేదు కద! నిజమేనా ?"

"నిజమేనండీ! నేను చెప్పేదంతా వినండి !"

"ఏమిటది ?"

"మన వీధి చివర ఎమ్మెల్యేగారు వున్నారు కదా! ఆయన కూతురు మొన్న మన ఇంటికివచ్చింది. మాటల సందర్భంలో 'ఈ ఇల్లు కట్టటానికి ఎంతయింది?" అంటూ అడిగింది. రెండు లక్షలు అయిందని చెప్పేను. ఆ అమ్మాయి నామాట నమ్మలేదు. సరిగదా నన్ను చాలా తేలిగ్గా మాట్లాడింది!"

"ఏమంది?"

"ఇల్లు కట్టిన తరువాత ఇలాగ అందరూ ఎక్కువరేట్లు చెబుతారు" అంది.

నాకు పౌరుషం వచ్చి అన్నాను. "ఇలా ఈవేళ అమ్మితే నాలుగు లక్షలు వస్తుంది" అని.

తానేమో 'రాదంది'. దాంతో మాటామాటా పెరిగింది.

ఇద్దరం పందెం వేసుకున్నాం! "అందుకే ఆ అమ్మాయి పేపర్లో ప్రకటన ఇచ్చింది. ఆ అమ్మాయి పేరే రేణుక!" అంటూ మాటలు ఆపింది సుజాత.

నాకు మతిపోతున్నట్లుంది.

"ఏమిటా పందెం?" అడిగేను.

"ప్రకటన వెలువడిన వారం రోజులలోగా యెవరయినా మన ఇంటిని నాలుగు లక్షల రూపాయలు కంటే ఎక్కువకు అడిగితే తాను నాకో పట్టుచీర— అయిదు వందలు విలువ చేసేది- కొనిస్తుంది! లేకపోతే నేను తనకి కొనివ్వాలి! ఇదే పందెం! ప్రకటన ఖర్చు ఎనభై రూపాయలూ చెరో నలభై భరించాలి. అదీ ఒప్పందం! పగలంతా మనింట్లోనే వుండి పోయింది రేణుక. మూడు గంటల దాకా చూసి తాను ఓడిపోయినట్లు ఒప్పేసుకుంది....ఇదిగో పట్టుచీర ఇచ్చేసింది!" అంటూ మాటలు ఆపి తలగడ క్రిందనుండి కవరుతీసి మిలమిల్లాడే పట్టుచీర అందులోంచి బయటకు లాగింది.

నాకు ఏం మాట్లాడాలో తోచలేదు కొంత సేపు!

గుడ్లప్పగించి పట్టుచీర వంక చూస్తూ వుండిపోయాను.